క్లుప్తంగా

మానవత ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న మానవత సభ్యులు

కొయ్యలగూడెం: తంగెళ్ళగూడెం గ్రామంలో కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న కారం రాజా రవీంద్ర అనే వ్యక్తికి కొయ్యలగూడెం మానవత శాఖ ఆదివారం ఆర్థిక సహాయం అందజేసింది. రూ.5 వేలు బాధితునికి అందజేసి భరోసా కల్పించారు. అదేవిధంగా గెడ సుబ్బారావు రూ.2 వేలు అందించారు. మానవత అధ్యక్షుడు బొమ్మ మోహన్, ముప్పనాపల్లి వెంకటేశ్వరరావు, ఆర్ఎంపీ చంటిబాబు, జి.రామ్మోహన్, గిద్దే ప్రసాద్, కె.భీమరాజు, ఎం.రాజారావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన పొగాకు రైతులు



ఎంపీ కోటగిరి శ్రీధర్‌కు పొగాకు పంట నష్టాన్ని వివరిస్తున్న వర్జీనియా రైతు సంఘం నాయకులు

జంగారెడ్డిగూడెం: ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌ను ఆదివారం వర్జీనియా రైతు సంఘం నాయకులు కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇటీవల మిచాంగ్ తుపాను కారణంగా జరిగిన వర్జీనియా పంటనష్టాన్ని రైతులు ఎంపీకి వివరించారు. తమను ఆదుకోవాలని కోరారు. ఎంపీని కలిసిన వారిలో వర్జీనియా రైతు సంఘం అధ్యక్షుడు ఘంటశాల గాంధీ, రైతు నాయకులు సత్రం లక్ష్మణరావు, బుద్దాల సత్యనారాయణ, తనికెళ్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు యాత్రకు తరలివెళ్లిన జనం



ఎం.నాగులపల్లి జాతీయ రహదారిపై ర్యాలీని ప్రారంభిస్తున్న వాసు

ద్వారకాతిరుమల: దేవరపల్లిలో ఆదివారం జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్రకు ద్వారకాతిరుమల మండలం నుంచి పెద్ద ఎత్తున జనం తరలివెళ్లారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు ఆధ్వర్యంలో 85 బస్సులు, అలాగే కార్లు, బైక్‌లపై సుమారు 5 వేల మంది పార్టీ శ్రేణులు, ప్రజలు సభాస్థలికి చేరుకున్నారు. ముందుగా బస్సులు, బైక్‌లను ఎం.నాగులపల్లి జాతీయ రహదారిపై వాసు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం వారంతా ర్యాలీగా దేవరపల్లికి వెళ్లారు.

చట్ట సభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాలి



మాట్లాడుతున్న విశ్రాంత జడ్జి అడబాల లక్ష్మి

ఏలూరు (టూటౌన్): చట్ట సభల్లో మహిళా ప్రాతినిధ్యం పెరగాలని విశ్రాంత జడ్జి అడబాల లక్ష్మి అన్నారు. స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మహిళలు-మహిళా కార్మికుల చట్టాలు అంశంపై ఆదివారం సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న అడబాల లక్ష్మి మాట్లాడుతూ ఓటు వజ్రాయుధం అని రాజ్యాంగంలో మహిళలకు సంబంధించిన హక్కులు, భద్రత, సమానత్వం, సాధన కోసం మహిళలు పోరాటాలు చేయాలన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో చట్ట సభల ద్వారానే చట్టాలు రూపొందుతాయన్నారు. చట్టాల అమలు బాధ్యత కార్య నిర్వాహక వ్యవస్థదే అన్నారు. చట్టాల అమలు సక్రమంగా జరగనప్పుడు కోర్టు ద్వారా పరిష్కరించుకునే విధంగా మహిళలు పోరాడాలన్నారు. మహిళలకు గౌరవ ప్రదమైన జీవితం ప్రాథమిక హక్కు అన్నారు. ఈ అవగాహన సదస్సులో ఏపీ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్షురాలు వరక శ్యామల, కార్యదర్శి మన్నవ యామిని, సహాయ కార్యదర్శి గొర్లి స్వాతి, కార్యనిర్వాహక అధ్యక్షురాలు కొండేటి బేబి, కార్యదర్శి అడ్డగర్ల లక్ష్మి ఇందిర పాల్గొన్నారు.

కోడిపందేలపై పోలీసుల దాడి

ఏలూరు టౌన్ : ఏలూరు రూరల్ మాదేపల్లి శివారు గురకలపేట ప్రాంతంలో కోడిపందేలపై ఏలూరు రూరల్ పోలీసులు దాడి చేశారు. ఏలూరు రూరల్ ఎస్సై రాజారెడ్డి తమ సిబ్బందితో కోడిపందేలు నిర్వహిస్తున్న వారిపై ఆదివారం దాడి చేశారు. కోడిపందేలు నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. కోడిపుంజు, రూ.1,400 నగదు, 270 కోడికత్తులను స్వాధీనం చేసుకున్నారు. వైఎస్సార్ కాలనీకి చెందిన కోడి కత్తులు సరఫరా చేస్తున్న పాలెపు వెంకటేశ్వరరావును అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని ఎస్సై రాజారెడ్డి తెలిపారు.

ఉవ్వెత్తున కదలివచ్చి..

- సామాజిక సాధికార బస్సు యాత్రకు అపూర్వ స్పందన
- కదంతొక్కిన పార్టీ శ్రేణులు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో దద్దరిల్లిన దేవరపల్లి

దేవరపల్లి/ నిడదవోలు రూరల్/ చాగల్లు/ గోపాలపురం: అభిమానం ఉవ్వెత్తున ఎగసిపడింది.. వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు పార్టీ శ్రేణులు కదిలి రావడంతో దేవరపల్లి జన కెరటంలా మారింది.. ఎక్కడ చూసినా వైఎస్సార్ సీపీ జెండాలు రెపరెపలాడాయి.. పార్టీ శ్రేణులు నూతనోత్సాహంతో కదం తొక్కారు. తమ బలగంతో ప్రతిపక్షాలకు దడ పుట్టించారు.. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గం దేవరపల్లిలో ఆదివారం జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్రకు ప్రజలు పోటెత్తారు. దేవరపల్లి, ద్వారకాతిరుమల, నల్లజర్ల, గోపాలపురం మండలాల నుంచి పార్టీ శ్రేణులు వేలాదిగా తరలివచ్చారు. జగనన్న అండతో తాము సాధించిన సాధికారతను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు ప్రజలకు వివరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాగుండాలంటే తిరిగి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే ధ్యేయంగా అంతా పనిచేద్దామని పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఇంతవరకూ ఏ ప్రభుత్వం చేయని సంక్షేమ పథకాలు, సామాజిక న్యాయం జగనన్నతోనే సాధ్యమైందని వివరించారు.

అడుగడుగునా నీరాజనాలు

దేవరపల్లి మండలం కృష్ణంపాలెం నుంచి సాధికార యాత్ర ప్రారంభం కాగా ప్రజలు అడుగడుగునా నీరాజనాలు పలికారు. బస్సుకు ముందు వేలాది మంది యువకులు బైక్‌లపై ర్యాలీగా సాగారు. జై జగన్ అంటూ నినాదాలు చేశారు. బస్సు యాత్రలో మంత్రులు కారుమూరి వెంకట నాగేశ్వరరావు, చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, తానేటి వనిత, ఎంపీలు మార్గాని భరత్‌రామ్, నందిగం సురేష్, ఎమ్మెల్యేలు తలారి వెంకట్రావు, ఉన్నమట్ల ఎలీజా, నియోజకవర్గ పరిశీలకుడు గన్నమని వెంకటేశ్వరరావు (జీవీ), ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు హాజరై మాట్లాడారు. పార్టీ విజయమే అజెండాగా ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ కడిమి వీరకుమారి, ఎంపీపీలు కేవీకే దుర్గారావు, ఉండవల్లి సత్యనారాయణ, బంకా జయలక్ష్మి, బొండాడ మోహిని, జెడ్పీటీసీ సభ్యులు పొట్టి స్వర్ణలత, కాకులపాటి లలిత, ముప్పిడి లక్ష్మి, చిగురుపల్లి శామ్యూల్, పార్టీ మండల అధ్యక్షులు కూచిపూడి సతీష్, కె.నాగరాజు, గగ్గర శ్రీనివాస్, వాసుబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర విభాజన విభాగం కార్యదర్శి కారుమంచి రమేష్, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



సామాజిక సాధికార యాత్రకు కదిలివచ్చిన ప్రభంజనంలో ఓ భాగం



వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



బైక్ ర్యాలీగా తరలివస్తున్న యువత



ప్రసంగిస్తున్న ఎంపీ మార్గాని భరత్, పక్కన ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

రేచర్ల వైఎస్సార్ సీపీ నూతన కమిటీ ఎన్నిక



రేచర్ల వైఎస్సార్ సీపీ నూతన కమిటీని అభినందిస్తున్న పార్టీ నాయకులు

చింతలపూడి: చింతలపూడి మండలం, రేచర్ల గ్రామ వైఎస్సార్ సీపీ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎంపీపీ డా.రాంబాబు నాయక్, సర్పంచ్ కె శివరామకృష్ణ ఆధ్వర్యంలో గ్రామ కమిటీ అధ్యక్షుడిగా నరుకుళ్ళ ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా బోడ వెంకటేశ్వరరావు నాయక్, కార్యదర్శిగా ఘంటా సత్యన్నారాయణలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ రాంబాబు నాయక్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గుత్తా మాధవరావు, మాగంటి లక్ష్మణదాస్, చింతా గోపాలకృష్ణ, పెనుగొండ శివరామకృష్ణ, నరుకుళ్ళ సుబ్బారావు, జి ముత్యాలరావు, చిక్కాల శ్రీనివాస్, అడపా వెంకట అప్పారావు, ఎ వెంకటేశ్వరరావు, కాన్వెంట్ రాజు, పి రాజేష్, పి కిషోర్, గంటా సత్యన్నారాయణ, కె వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: వివాహిత ఫిర్యాదుతో వరకట్న వేధింపుల కేసు నమోదైంది. హెచ్‌సీ జె.మోషే తెలిపిన వివరాలివి. ఏలూరు సత్రంపాడుకు చెందిన మరీదు మణిరామ్‌కుమార్‌కు, సాయిలక్ష్మికి పదేళ్ల క్రితం వివాహమైంది. అదనపు కట్నం తీసుకురావాలని శారీరకంగా, మానసికంగా భర్త ఫణిరామ్‌కుమార్ వేధిస్తున్నాడని, అత్తమామలు కూడా అతనికి సహకరిస్తున్నారని సాయిలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ తెలిపారు.

సుబ్బారాయుడి కల్యాణోత్సవానికి ఏర్పాట్లు

చింతలపూడి: సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెం గ్రామంలో సోమవారం ప్రత్యక్ష సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలను జరపడానికి నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏటా వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణాన్ని ఇక్కడ కన్నుల పండుగగా జరుపుతారు. ప్రతి ఏటా కుల, మతాలకు అతీతంగా ఆలయ నిర్వాహకులు షష్ఠి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తుంటారు. పశ్చిమగోదావరి, కృష్ణా, ఖమ్మం, తూర్పు గోదావరి, విశాఖపట్నం, మహబూబ్ నగర్ జిల్లాల నుంచే కాక హైదరాబాద్, నాగపూర్ నుంచి కూడా భక్తులు వేలాదిగా వచ్చి ఈ ఉత్సవాల్లో పాల్గొంటారు. 1980లో ఇక్కడ ఆలయాన్ని ప్రతిష్టించారు. అంతకు ముందే దశాబ్దాల కాలంగా స్వయంభూ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి (పుట్ట రూపంలో) అవతరించారని భక్తులు తెలిపారు. శ్రీ బాలాంత్రపు వెంకటేష్‌శర్మ(సిద్ధాంతి) ఆధ్వర్యంలో వేద పండితులు స్వామివారి కల్యాణాన్ని జరుపుతారని నిర్వాహకులు తెలిపారు. ఇక్కడికి వచ్చే వేలాది మంది భక్తుల కోసం దాతల సహకారంతో భోజన సదుపాయాలు ఏర్పాటు చేశారు. సాయంత్రం 4 గంటల నుంచి మండలంలోని చింతలపూడి, యర్రంపల్లి, వెలగలపల్లి, ప్రగడవరం గ్రామాల్లో స్వామివారి ఊరేగింపు జరుపుతారు. షష్ఠి సందర్భంగా ప్రతి ఏటా చెన్న కేశవస్వామి సేవను భక్తులు ఇక్కడ ఘనంగా చేస్తారు. కుణతాలు ధరించిన బృందం భక్తుల మొక్కులను చెన్నకేశవస్వామి సన్నిధిలో తీర్చుకుంటారు.



నాగిరెడ్డిగూడెంలో పుట్ట రూపంలో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

భక్తుల సహకారంతో అభివృద్ధి



సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. భక్తుల సహకారంతో ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నాం. ఆలయ మండపం నిర్మాణం పూర్తి చేశాం. ఆలయం సమీపంలో వచ్చే భక్తుల కోసం ఎకరం విస్తీర్ణంలో పార్కు అభివృద్ధి జరుగుతోంది.

– జాస్తి సాంబశివరావు, ఆలయ కమిటీ నిర్వాహకులు

ఘనంగా కార్తికేయుని కల్యాణం



బయ్యనగూడెం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో కార్తికేయ కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: బయ్యనగూడెంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. అర్చకులు కొత్తలంక శివ సత్యనారాయణచార్యులు ఆధ్వర్యంలో పలువురు భక్త దంపతులు కల్యాణ తంతులో పాల్గొని స్వామి వారికి కల్యాణం జరిపించారు. అదేవిధంగా మదన గోపాలస్వామి ఆలయంలో ఉపాలయమైన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు గుడిపూడి శేషాచార్యులు, తాడేపల్లిగూడెం రోడ్‌లోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద బ్రహ్మశ్రీ అనిపెద్ది నరసింహ శర్మ ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం నిర్వహించారు. కన్నాపురం, దిప్పకాయలపాడు, మంగపతిదేవిపేట, నరసన్నపాలెం, రాజవరం, బోడిగూడెం, ఆలయాలలో సుబ్రహ్మణ్య షష్ఠి ఉత్సవాలు నిర్వహించారు.

అయోధ్య అక్షత కలశాలకు పూజలు

కొయ్యలగూడెం: స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయంలో అయోధ్య అక్షతా కళశాలకు ఆదివారం పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై కళశాలకు సామూహిక పూజలు చేశారు. హిందువుల ఆరాధ్య దైవం, శ్రీరాముడు జన్మించిన అయోధ్య నుంచి బాల రాముని పూజ అక్షతలు తీసుకువచ్చినట్లు వేదుల జనార్దన్ పేర్కొన్నారు. ఆలయంలో అక్షతల కలశాలకు 40 మంది దంపతులచే పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామనామ సంకీర్తన, 108 సార్లు శ్రీరామ నామ జపం, హనుమాన్ చాలీసా పారాయణం సామూహికంగా చేశారు. పూజ చేసిన దివ్య అక్షింతలను మండలంలోని ప్రతి గ్రామంలో ఉన్న రామాలయం ద్వారా ప్రతి హిందూ కుటుంబానికి జనవరి ఒకటో తేదీ నుంచి ఐదవ తేదీ వరకు అందిస్తున్నట్లు తెలిపారు. వీటితోపాటు శ్రీరాముని మందిర చిత్రపటం, రామ మందిరం నిర్మాణ ప్రాణ ప్రతిష్ట ఆహ్వాన పత్రిక అందజేయడం జరుగుతుందన్నారు. ప్రతి గ్రామంలోనూ జనవరి ఒకటో తేదీన శోభా యాత్రలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆర్ఎస్ఎస్ కార్యవాహక్ చేతి వెంకటస్వామి, జిల్లా గ్రామీణ వికాస్ ప్రముఖులు యర్రంగోల బాబురావు, బీజేపీ మండల అధ్యక్షుడు బొమ్మ శ్రీనివాసు, విశ్వహిందూ పరిషత్ ప్రముఖ ఉషారాణి, వేదుల జనార్దనరావు, ఆర్ఎస్ఎస్ ప్రచార ప్రముఖ్ ఖండ సేవా ప్రముఖ్, ఎం.వెంకటరెడ్డి, ఆరేటి ఏసు, 26 గ్రామాల నుంచి రామాలయాల ప్రతినిధులు విచ్చేశారు.



కన్యకా పరమేశ్వరి ఆలయంలో కలశాలకు పూజలు నిర్వహించి ఊరేగిస్తున్న దృశ్యం

జోరుగా తేగల విక్రయాలు

బుట్టాయగూడెం: శీతాకాలంలో లభించే తేగలకు మంచి డిమాండ్ ఉంటుంది. అందులోనూ పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన గ్రామాల్లో లభించే తేగలు ఎంతో రుచిగా ఉంటాయి. బుట్టాయగూడెం, దొరమామిడి, సీతప్పగూడెం, దాసియ్యపాలెం, దుద్దుకూరు సమీపంలో తేగల పాత్రలు ఎక్కువగా ఉన్నాయి. తేగల పాత్రల నుంచి తీసిన తేగలను బుట్టాయగూడెం పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తూ ఉంటారు. ఈ సీజన్‌లో తేగలు కొనుగోలు చేసేందుకు ప్రజలు కూడా ఆసక్తి చూపుతారు. తేగల విక్రయాల ద్వారా అనేక మంది ఉపాధి పొందుతున్నారు. నియోజకవర్గంలో దాదాపు 85 కుటుంబాల వరకూ సీజన్‌లో తేగల విక్రయాల ద్వారా ఉపాధి పొందుతున్నారు. సెప్టెంబర్ నుంచి జనవరి నెలాఖరు వరకూ తేగల విక్రయాలు జోరుగా సాగుతుంటాయి.

తేగల కట్ట సైజును బట్టి రేటు

తేగల కట్ట సైజును బట్టి విక్రయదారులు తేగలను అమ్ముతూ ఉంటారు. పెద్ద సైజు తేగల కట్ట రూ.50 నుంచి రూ.100 వరకూ, చిన్న సైజు తేగల కట్ట రూ.20 వరకూ వ్యాపారులు విక్రయిస్తున్నారు. ఎంతో రుచికరమైన తేగల ధర అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండడంతో ఎక్కువ మంది ప్రజలు ఈ తేగలను కొనుగోలు చేస్తున్నారు.

రూపొందే విధానం

తాడిచెట్ల నుంచి తాటి కాయలు తయారైన తర్వాత వాటిని సేకరించి నేలలో గుంతలు తీసి పాతర వేస్తారు. 60 రోజుల్లో మొలకలు వచ్చి తేగలుగా తయారవుతాయి. తర్వాత పాతర నుంచి తేగలను తెంచి వేరు చేస్తారు. వాటిని మట్టి కుండలో పెట్టి కాలుస్తారు. తర్వాత కట్టలుగా కట్టి కడతారు.



దుద్దుకూరు సమీపంలో పాతర నుంచి తేగలు తీస్తున్న దృశ్యం

తేగల వల్ల లాభాలు

తాటికాయల నుంచి లభించే తేగల్లో మానవ శరీరానికి మేలు చేసే పీచు పదార్థాలతో పాటు పిండి పదార్థం కూడా పుష్కలంగా లభిస్తుంది. జీర్ణశక్తిని మెరుగుపరిచేందుకు, ఆరోగ్యానికి తేగలు ఎంతగానో దోహదపడతాయి. అలాగే తేగలు తినడం ద్వారా బరువు కూడా తగ్గుతారని పలువురు అంటున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



తిరుమలంపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆనాటి గురువులతో పూర్వ విద్యార్థులు

ద్వారకాతిరుమల: ఇరవై ఏళ్ల క్రితం కలిసి చదువుకున్న విద్యార్థులు మళ్లీ అదే పాఠశాలలో కలిసి సందడి చేశారు. 2002-2003 విద్యా సంవత్సరంలో పదవతరగతి పూర్తి చేసిన విద్యార్థులు ద్వారకాతిరుమల మండలం తిరుమలంపాలెంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఆ నాటి మధుర స్మృతులు, చేసిన అల్లరిని గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని సందడి చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆనాటి ఉపాధ్యాయులు రామకృష్ణ, శేషుకుమార్, యసోదరావు, శ్రీనివాసరావు, సాయిబాబా, సూర్యప్రకాష్, నాగేశ్వరరావు, రాజేష్‌లను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఆ తరువాత జరిగిన విందు, సాంస్కృతిక కార్యక్రమాల్లో వారంతా పాల్గొన్నారు.

విద్యార్థుల విజ్ఞాన యాత్ర

జంగారెడ్డిగూడెం: స్థానిక ఛత్రపతి శివాజీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు శనివారం విజ్ఞాన యాత్ర నిర్వహించారు. దీనిలో భాగంగా గుంటుపల్లి మహా నాగ పర్వతము, జీలకర్రగూడెంలో ఉన్న మొక్కజొన్న పరిశోధనా కేంద్రాన్ని తదితర ప్రదేశాలను విద్యార్థులు సందర్శించారు. వివిధ ప్రదేశాలకు వెళ్లి అక్కడి క్షేత్ర పరిశోధనలు జరిపి ఆ ప్రదేశాల విశేషాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధ్యాపకుడు బి.అశోక్ మాట్లాడుతూ ఇలాంటి యాత్రల వల్ల విద్యార్థులకు విజ్ఞానానికి సంబంధించి ఆసక్తి కలుగుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు నాగేశ్వరరావు, వి.హనుమంతరావు, ఎం.శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.



గుంటుపల్లి బౌద్ధారామాలకు వెళ్లిన సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

నేడు ఏలూరులో విద్యార్థుల ర్యాలీ

- వై ఏపీ నీడ్స్ జగన్‌కు సన్నద్ధం
- హాజరుకానున్న ప్రముఖ క్రికెటర్ అంబటి రాయుడు

ఏలూరు టౌన్: రాష్ట్రంలో పేద బలహీన వర్గాల అభ్యున్నతికి సంక్షేమ పాలనతో ఆదుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి యావత్ విద్యార్థి లోకం, యువత పెద్దెత్తున మద్దతు తెలుపుతూ ఏలూరులో నేడు భారీ ర్యాలీ చేపట్టేందుకు ఏర్పాట్లు చేశారు. ఏలూరు నగరంలోని జెడ్పీ కార్యాలయం వద్ద నుంచి సోమవారం ఉదయం 10.30 గంటలకు వేలాది మంది విద్యార్థులతో ర్యాలీ ప్రారంభం అవుతుందని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కందుల దినేష్ రెడ్డి తెలిపారు. ఏలూరు నగరంలోని ఆయా విద్యాసంస్థలకు చెందిన వేలాదిమంది విద్యార్థులు ర్యాలీలో పాల్గొంటారని తెలిపారు. ముఖ్యఅతిథులుగా ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ళ నానితో పాటు యువతకు స్ఫూర్తినిస్తూ ప్రముఖ భారత క్రికెట్ క్రీడాకారులు అంబటి తిరుపతి రాయుడు హాజరవుతారని తెలిపారు. ఈ భారీ కార్యక్రమంలో ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు పోనుగంటి చైతన్య, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ హాజరవుతారని తెలిపారు. ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో దివంగత మహానేత వైఎస్సార్ విగ్రహం వద్ద మానవహారం, అనంతరం నగరంలో ర్యాలీ చేపడతామని తెలిపారు. ఏలూరు జిల్లాలోని వైఎస్సార్ సీపీ అభిమానులు, విద్యార్థి సంఘం నాయకులు, విద్యార్థులు భారీ సంఖ్యలో హాజరై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తమ మద్దతును తెలపాలని దినేష్ రెడ్డి కోరారు.

వైద్య శిబిరంలో 136 మందికి పరీక్షలు



నేత్ర వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న పరమహంస యోగానంద నేత్రాలయ వైద్యులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : ఏలూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక గీతా భవనంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 136 మంది పేదలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. నగరానికి చెందిన ఆయుష్ హాస్పిటల్ వైద్యులు బీపీ, సుగర్, జనరల్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీవీ బాలకృష్ణారావు సహకారంతో నిర్వహించిన నేత్రవైద్య శిబిరంలో 36 మందికి పరీక్షలు నిర్వహించి వారిలో 16 మందికి శస్త్రచికిత్స అవసరమని గుర్తించారు. గుర్తించిన వారిని వేమగిరి పరమహంస యోగానంద నేత్ర వైద్యశాలకు తరలించారు. అవసరమైన మరో 31 మందికి కళ్లజోళ్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఏలూరు లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ మానేపల్లి రామారావు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ శిబిరంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు కాకరాల వేణుబాబు, అక్కినేని వెంకటేశ్వర రావు, బొలిశెట్టి సురేష్ కుమార్, అల్లం వెంకట సుబ్బారావు, చెన్న వెంకట్రామయ్య, బొడ్డు శ్రీనివాస్, గొల్లపూడి రామకృష్ణ, రావిపూడి మోహనరావు రోగులకు సేవలు అందించారు.